# 75. మనిషి-బండ

ఓ శిల్పికి చాలాకాలంగా ఆంజనేయస్వామి విగ్రహం ఒకటి చెక్కాలని ఉంది. అందుకు తగిన శిల కోసం వెదుకుతూ బయలుదేరాడు. ఎన్ని కొండలు తిరిగి ఎన్ని బండరాళ్ళు చూసినా అతనికి పనికివచ్చే సరైన రాయి కనబడలేదు. ఆ అన్వేషణలో అతను ఓ అడవిని దాటి ఓ గ్రామంలోంచి వెళ్తూండగా గ్రామం మధ్యలో ఓ మర్రి చెట్టు కింద ఉన్న ఓ బండరాయి అతన్ని ఆకర్షించింది.

వెంటనే దాన్ని పరిశీలించి చూసి తను ఇంత కాలం వెదికే రాయి అలాంటిదే అని గ్రహించాడు. ఆ గ్రామస్థులకి విషయం చెప్పి ఆ బండరాయిని అడిగితే, తాము కూర్చునేందుకు సౌకర్యంగా ఉన్న ఆ రాతిని తరలించేందుకు వారు అభ్యంతరం చెప్తారని అతను భయపడ్డాడు. దాంతో అర్ధరాత్రి అతను దాన్ని బండి మీద వేసుకుని గ్రామ పొలిమేరల్లో ఉన్న అడవికి తరలించాడు. దాన్నతను హనుమంతుడి విగ్రహంగా చెక్కాడు. ఆ తర్వాత అలాంటి మరి కొన్ని విగ్రహాలు చెక్కే ఉద్దేశంతో, మంచి రాళ్ళ వేటలో ముందుకు సాగాడు.

ఆ గ్రామస్థులకి ఈ విగ్రహం గురించి తెలిసింది. అంతా వచ్చి చూసి ఆ విగ్రహం అందానికి ముగ్ధులయ్యారు. దానికో గుడి కట్టించారు. ధూప, దీప, నైవేద్యాల ఏర్పాట్లు చేసారు. నిత్యాభిషేకాలు, అష్టోత్తరాలు, పూలమాలల అలంకరణతో వైభవంగా ఆరాధన సాగుతోంది.

కొంతకాలానికి ఆ శిల్పి మళ్ళీ ఆ గ్రామానికి వచ్చాడు. తను చెక్కిన విగ్రహానికి జరిగే పూజని చూసి ఎంతో సంతోషించాడు. అతనే ఆ విగ్రహాన్ని చెక్కిన శిల్పి అని గ్రహించిన ఆ గ్రామస్థులు అతన్ని సన్మానించ దలిచారు. ఆ సన్మానంలో అతన్ని మంచి విషయాలు చెప్పమని అడిగితే అతనిలా చెప్పాడు.

"నేనీ విగ్రహాన్ని చెక్కడానికి ఉపయోగించిన బండ మీ గ్రామంలోని మర్రి చెట్టు కింద ఉన్నదే. మీరు దాని మీద కూర్చుని దంతావధానం చేస్తూ దానిపై ఉమ్మేసేవారు. కొందరు దానిమీద రాత్రుళ్ళు మల మూత్ర విసర్జనా చేసేవారు. కొందరు చుట్టలు కాల్చి నుసిని దాని మీద రాల్చేవారు. నేనా రాతితోనే హనుమంతుడి విగ్రహాన్ని మలిచాను. ఇప్పుడది గొప్ప పూజలందుకుంటోంది. దీన్నించి మనం ఓ పాఠం నేర్చుకోవచ్చు. మనమంతా కూడా ఆ బండరాయి లాంటి వాళ్ళమే. బండలోని అనవసరపు భాగాలు చెక్కి తొలగిస్తే అప్పుడది దైవరూపంలోకి వచ్చింది. అలాగే మనం కూడా మనలోని స్వార్ధపూరిత అవగుణాలని తొలగించుకోగలిగితే మనలోని పరమాత్మ మనకి దర్శనం ఇస్తాడు. ఇందుకు మనం దైవారాధన అనే ఉలితో మనలోని అసుర భావాలని నిత్యం చెక్కుకుంటూ వెళ్తే కొంత కాలానికి మనలోని దివ్యత్వం బహిర్గతమై 'మన దేహమే ఓ దేవాలయం' అన్న స్ఫురణ కలుగుతుంది. ఉట్టి పూజలతోనే సరిపెట్టుకోకుండా, మనల్ని మనం దైవంగా మలచుకునే పనిని శ్రద్ధగా మనమంతా చేపట్టాలి."

అప్పటి నుంచి ఆ గ్రామస్థులంతా నిత్యం ఆ దేవాలయానికి వచ్చి ఉదయం, సాయంత్రాలు ధ్యానం చేయసాగారు.

## 76. పొంచి వున్న అపాయం

పనిమీద పొరుగూరుకి వెళ్తున్న ఓ భర్తకి అతని భార్య మధ్యాహ్నానికి, రాత్రికి భోజనం కట్టి ఓ సంచీలో పెట్టిచ్చింది. ఆ సంచీని భుజానికి తగిలించుకుని అతను ప్రయాణమయ్యాడు. మధ్యాహ్నానికి ఓ అడవికి చేరుకున్నాడతను. ఓ చెట్టు కింద కూర్చుని సంచీలోంచి భార్య ఇచ్చిన భోజనం పొట్లం బయటకి తీసి దాన్ని తిన్నాడు. దగ్గరే ఉన్న సరస్సులోని నీటిని తాగి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అతను తిరిగి ప్రయాణమయ్యాడు.